క్లుప్తంగా

లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలి

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ పథకానికి మండలంలో లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని తహసీల్దార్ హరిబాబు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు అర్హులైన వారి వంట గ్యాస్ కనెక్షన్ నెంబర్ సేకరించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి జూలకంటి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఐకి సన్మానం



సీఐ వీరబాబును సన్మానిస్తున్న ఆలయ కమిటీ, గ్రామస్తులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో గురువారం మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, స్థానిక ఎస్ఐ హరిబాబులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదే విధంగా అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సీఐ, ఎస్ఐలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

డిండి : మండల పరిధిలోని సింగరాజుపల్లిలోని గర్భిణులు, బాలింతలకు స్థానిక అంగన్ కేంద్రంలో టీచర్ ఇందిరా సరిగా పౌష్టికాహారం అందించడం లేదని గ్రామస్తుల ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆ కేంద్రాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం పంపిణీ రిజిస్టర్‌ను పరిశీలించి గ్రామస్తులతో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం పంపిణీ విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

మిర్యాలగూడ అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 8మంది వాహనదారులను పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపర్చగా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి మందుబాబులకు రూ.10 వేల రూపాయల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ మోహన్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు ఉంటాయని తెలిపారు.

బంజారా ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

మిర్యాలగూడ టౌన్ : బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను గురువారం ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులందరికీ ఎంతో ఉపయోగపడే విధంగా డైరీని ముద్రించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్, నాయకులు సైదానాయక్, మక్లనాయక్, శ్రీను నాయక్, సీనియర్ జర్నలిస్టులు ఖాజాహాఫీజుద్దీన్, ఎండీ అస్లాం, జంగా లక్ష్మణ్ యాదవ్, మంద సైదులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా భాస్కర్ నాయక్ ఎన్నిక



హాలియా : ఆలిండియా బంజారా సేవా సంఘం సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా త్రిపురారం మండలానికి చెందిన ధనావత్ భాస్కర్ నాయక్ ఎన్నికయ్యారు. గురువారం హాలియా పట్టణంలో ఆలిండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్ నాయక్ అధ్యక్షతన ఆ సంఘం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడిగా ధనావత్ భాస్కర్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించి సంఘం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ బాబురావు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్ నాయక్, రాష్ట్ర సీనియర్ నాయకులు రమావత్ శంకర్‌నాయక్, నియోజకవర్గ నాయకులు కేతావత్ బిక్షానాయక్, బాణావత్ సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని అల్పాహారం

- పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- స్నాక్స్ అందజేతకు దాతలు కరువు
- సాయంత్ర వేళలో నీరసిస్తున్న విద్యార్థులు

పెద్దవూర : ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశానుసారం వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించింది. దీంతో ఉపాధ్యాయులు అంతా కలిసి తయారు చేసిన ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు పూనుకున్నారు. దీనిలో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పది విద్యార్థులకు ప్రత్యే తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసి పది గంటల పాటు పాఠశాలలో ఉండి చదువుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యార్థులకు దాతల సాయంతో స్నాక్స్ అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. కానీ మండంలోని ఏ పాఠశాలలోనూ విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. మండలంలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 200 మందికి పైగా పదో తరగతి చదువుతున్నారు.

అర్ధాకలితో విద్యార్థులు

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఉదయం 8:30 నుంచి 9:30 వరకు, అలాగే సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు పాఠశాల పనిదినం తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికోసం మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు ఉదయం 7గంటలకే ఇళ్ల నుంచి బయలుదేరి, ఆయా గ్రామాల స్టేజీ వరకు నడిచి వచ్చి అక్కడ నుంచి బస్సుఆల్లో పాఠశాలలకు రావాల్సి పరిస్థితి నెలకొంది. నిత్యం వ్యవసాయ పనులకు వెళ్లే తల్లిదండ్రులు ఆ సమయానికి తమ పిల్లల కోసం వంటలు వండాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు ఆ సమయంలో విద్యార్థులు భోజనాలు చేయలేక ఖాళీ కడుపుతో పాఠశాలలకు వస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేశాక విద్యార్థులు సాయంత్రం 6:30 గంటల వరకు పాఠశాలల్లోనే ఉండటంతో ఆకలికి తట్టుకోలేక నీరసించి చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.

ముందుకురాని దాతలు

ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించిన ప్రభుత్వం విద్యార్థులకు స్నాక్స్ అందించలేమంటూ చేతులెత్తేసింది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఐలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి విద్యార్థులకు స్నాక్స్(అల్పాహారం) అందించాలని సూచించింది. కానీ ఆయా పాఠశాలల హెచ్ఎంలు వారి వద్దకు వెళ్లి విద్యార్థులకు స్నాక్స్ అందించాలని వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొందరు దాతలు ముందుకు రాగా ఈ సారి మాత్రం దాతల దాతృత్వం కరువైంది. దీంతో విద్యార్థులు సాయంత్రం పూట నుంచి నీరు తాగి కడుపు మాడ్చుకుంటున్నారు. వ్యక్తిగత ప్రచారం, హంగూ ఆర్భాటాల కోసం రూ.లక్షలు ఖర్చుపెట్టే ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు స్నాక్స్ అందిస్తే పుణ్యంతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హృదయాల్లో స్థానం సంపాదించుకునే అవకాశం ఉంటుంది.



పెద్దవూర జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సాయంత్రం పూట ఆకలేస్తుంది



ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం 6:30 గంటల దాకా పాఠశాలల్లోనే ఉండాల్సి వస్తుంది. సాయంత్రం చాలా ఆకలేస్తుంది. మంచినీళ్లు తాగి సరి పెట్టుకుంటున్నాం. ప్రభుత్వం, దాతలు స్పందించి ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందిస్తే పాఠశాల సమయంలో కంటే స్టడీ అవర్స్‌లో బాగా చదువుతాం.

– ఆర్.ఆర్.కావ్య, విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్ పెద్దవూర

చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాం



ప్రత్యేక తరగతులతో ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారిగా వచ్చి ఉదయం, సాయంత్రం వేళలలో ఉపాధ్యాయులు దగ్గరుండి సందేహాలను నివృత్తి చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా చదివిస్తుండటంతో పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తాననే ధీమా ఏర్పడింది. కాఈ సాయంత్రం దాకా తరగతులు ఉండటం ఆకలి వేస్తుంది. దీంతో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాము.

– పి.వినోద్, విద్యార్థి

దాతలు ముందుకు రావాలి



పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. సాయంత్రం పొద్దు పోయేదాకా పాఠశాలల్లోనే ఉండటంతో ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులు ఆకలికి అలమటిస్తూ నీరసించి చదవుపై శ్రద్ధ పెట్టలేకపోవతున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు దాతలు ముందుకు రావాలి.

– తరి రాము, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, పెద్దవూర

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



హాలియా : బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు భగత్, సురేందర్

మిర్యాలగూడ : కృష్ణా నదిపై ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ ఈనెల 13న నల్లగొండలో చేపట్టే మాజీ సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్‌రెడ్డిలు అన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మిర్యాలగూడ, దామరచర్ల మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అమరావతి సైదులు, చిట్టిబాబు నాయక్, రామకృష్ణ, ఏడుకొండలు, సైదులుయాదవ్, జానయ్య, వెంకటరమణచౌదరి, భిక్షంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'చలో నల్లగొండ'ను జయప్రదం చేయాలి

హాలియా : ఈనెల 13న నల్లగొండలో బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో నిర్వంచే చలో నల్లగొండ భారీ బహిరంగ ప్రజలను విజయవంతం చేయాలని బహిరంగ సభసమయన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే జూలజు సురేందర్, సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పిలుపున్చిచ్చారు. గురువారం హాలియా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం చలో నల్లగొండ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రికార్ చైర్మన్ రాంచందర్ నాయక్‌చ జెడ్పీ వైస్ చైర్మన్ పెద్దులు, ఎంపీపీ జయమ్మ, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను అనర్హురాలిగా పకటించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

హాలియా : నాలుగు నెలలుగా హాలియా మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయని మున్సిపల్ చైర్‌పర్సన్‌ను అనర్హురాలిగా ప్రకటించాలని కోరుతూ కౌన్సిలర్లు గురువారం అదనపు కలెక్టర్ హేమంత్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. హాలియా మున్సిపాలిటీ ఏర్పడి నాలుగేళ్లు అవుతున్నా పట్టణంలో ఏ మాత్రం అభివృద్ధి జరగడం లేదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వ్యక్తిగత కారణాలు ఉన్నందున సమావేశాలు ఏర్పాటు చేయక నాలుగు నెలలు కావస్తుందని పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయి ఉన్నందునా కౌన్సిలర్లుగా తాము ప్రజా సమస్యలు పరిష్కరించ లేకపోతున్నామని తెలిపారు. మున్సిపల్ జనరల్‌బాడీ సమావేశం ఏర్పాటు చేయని చైర్‌పర్సన్‌ను అనర్హురాలిగా ప్రకటించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో హాలియా మున్సిపల్ కౌన్సలర్లు అన్నెపాక శ్రీనివాస్, గౌనీ సుధారాణిరాజా రమేష్, పిల్లి చంద్రకళ ఆంజనేయులు, దేపావత్ ప్రసాద్‌నాయక్, తక్కెళ్లపల్లి ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిడమనూరు : మండల కేంద్రంలో గురువారం సీపీఎం నాయకులు కేంద్ర దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం పై అనుసరిస్తున్న అప్రజాస్వామిక చర్యలకు నిరసనగా కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు దిష్టిబొమ్మను దహనం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటేష్, గుర్వయ్య, చంద్రశేఖర్, శేఖర్, బాలనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పెద్దవూర : మండలంలోని పాల్తీతండా, పర్వేదుల, చలకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో మూడు నెలలుగా ఉచిత గురుకుల కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సిబ్బంది జీఎల్ఎన్ రావు తెలిపారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులందరికీ గురువారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాఖపురం పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న శాఖపురం నాయకులు

నిడమనూరు : మండలంలోని శాఖపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్ కిషన్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఉదయం 11గంటలైనా విధులకు హాజరు కావడం లేదని, గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించడంలో నిర్లక్ష్యం, గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను రైస్‌మిల్లు వారికి అద్దెకు నడుపుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో తాగునీటి కొరత ఉన్నా ట్యాంకర్ ద్వారా నీటిని అందించాల్సి ఉండగా, ట్యాంకర్‌ను హరికృష్ణ మిల్లుకు అద్దెకు ఇచ్చాడని పేర్కొన్నారు. బుధవారం స్పెషల్ ఆఫీసర్ వచ్చి మందలిచ్చిన గురువారం ఉదయం 11, 12గంటలైన పంచాయతీ కార్యాలయానికి రాలేదని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆస్తి, నిధులను దుర్వినియోగం చేస్తున్నందున విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మోసాల శ్రీను, దేవదానం, ఉషాక్, ఏసయ్య, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలి

పెద్దవూర : ఈ నెల 10, 11 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరె రమేష్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో కన్వెన్షన్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో అన్ని రంగాల్లోనూ విద్యార్థినులు, మహిళపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు లేకుండా పోయాన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యుడు నవీన్, కావ్య, భవ్య, అంజలి, సునీత, స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

మాడుగులపల్లి : రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు వినయ్ అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 42గేదెలు, 22ఆవులకు చూడి నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మేఘ్యా నాయక్, శ్రీలత. జయమ్మ, గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులతో పెరుగుతున్న నేరాలు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘాల నేతలు

మిర్యాలగూడ అర్బన్ : విచ్చలవిడి మద్యంతో జిల్లాలో నేరాలు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం తక్షణమే యుద్ధప్రాతిపదికన బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి అన్నారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో 'విచ్చలవిడి బెల్ట్ షాపులు- పెరుగుతున్న నేరాలు' అనే అంశంపై ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను సృష్టించాల్సిన పాలకులు మద్యాన్ని ఆధారంగా చేసుకుని వచ్చే ఆదాయంతో ప్రభుత్వాలు నడపడం దారుణమన్నారు. మునుగోడు తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బెల్ట్ షాపులను ఎత్తివేయాలని కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు అరుణకుమారి, గాదెపద్మమ్మ, నాగమణి, పూలమ్మ, శాంతమ్మ, హుస్సేన్, బీసీ సంఘం నాయకులు బంటు కవిత, కృష్ణవేణి, సరిత, మంగ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పథకాలను ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

వేములపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ కిసాన్ మోర్చా జిలఅధ్యక్షుడు చలమల్ల సీతారాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెంది అగ్రరాజ్యంగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రభారి లచ్చిరెడ్డి, జిల్లా నాయకులు సజ్జల నాగిరెడ్డి, పెదమాం వెంకన్న, పెదమాం భరత్, ఉపేందర్, లవయ్య, మహేష్, రాము, సతీష్, ప్రభాకర్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ



వ్యాపారులకు గొడుగు అందజేస్తున్న సభ్యులు

దేవరకొండ : లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర ఆధ్వర్యంలో పట్టణంలోని చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై చిరు వ్యాపారాలు, చేతి వృత్తి పనులు చేసుకుంటున్న వారికి గురువారం మిత్ర క్లబ్ అధ్యక్షుడు అంకం చంద్రమౌళి గొడుగులు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కూరెళ్ల కృష్ణాచారి, మాకం మహేశ్, పిజే శ్యాంసన్, ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మిర్యాలగూడ : మాట్లాడుతున్న బైరం దయానంద్

మిర్యాలగూడ : కార్మికుల హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ కోరారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఐ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులతో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి జీడయ్యయాదవ్, సీఐ మండల కన్వీనర్ లింగానాయక్, నాయకులు లింగారెడ్డి, శాంతమ్మ, కోటయ్య, మహేష్, వీరన్న, సుబాని, సైదులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నిడమనూరు : కేంద్ర ప్రభుత్వం మోదీ నాయకత్వంలో అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కోమండ్ల గుర్వయ్య గురువారం కోరారు. ఈనెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ గ్రామీణ సమ్మెను కార్మికులు, రైతులు, కార్మిక సంఘాలు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కోటేష్, కొండేటి ఎను, బాలనారయణ, శేఖర్, పాల్గొన్నారు.

గృహ వినియోగ ఖర్చులపై సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

పెద్దవూర : గృహ వినియోగ ఖర్చులపై జాతీయ గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మండలంలో సర్వే నిర్వహించినట్లు స్టాటస్టికల్ అధికారులు కొమ్మెర సతీష్‌కుమార్, కారంగుల అనూషలు తెలిపారు. గురువారం నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ నుంచి అధికారులు వచ్చి మండలంలోని బోనూతల, నెరటోనిగూడెం, తూర్పు పూలగూడెం, చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయం, పోతునూరు రెవెన్యూ గ్రామాలలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా పోతునూరు గ్రామంలో 298 కుటుంబాలు, తూర్పుపూలగూడెం, బోనూతల, నెరటోనిగూడెం, జెఎన్‌వీ క్యాంపస్‌లలో 600 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. ఈ సర్వేలో సంఖ్యాక శాస్త్ర పద్ధతుల ద్వారా విద్యార్హతలు, చేస్తున్న పని, ఆహారం, ఆరోగ్యం, జీవన విధానం, నీటి సదుపాయం, వంటగ్యాస్, వంట చెరుకు వినియోగం, రేషన్ బియ్యం అందుబాటు, నిత్యావసర ఖర్చులు, వినియోగం వంటి వాటిపై సర్వే చేసినట్లు పేర్కొన్నారు. ఈ సర్వేతో దేశ అభివృద్ధిలో భాగంగా పథకాల రూపకల్పనకు బడ్జెట్ కేటాయింపులకు, స్థూల జాతీయ ఉత్పత్తి గణనకు, తలసరి ఆదాయ గణనకు ఈ సర్వే మూలాధానం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాయప్రోలు విజయ, బూరుగు కవిత, వరమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



వేములపల్లి : పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య



త్రిపురారం : వీధులను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

వేములపల్లి : ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీఓ చెన్నయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా పలు వీధుల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతిరోజు గ్రామంలో ఫాగింగ్ చేయాలని, చెత్త కుప్పలు, నీటి నిల్వలేకుండా చూడాలన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఎంపీడీఓ జానయ్య, ఆర్ఐ మహేందర్‌రెడ్డి, బిల్ కలెక్టర్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురారం : ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటుగా చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ అలివేలు మంగమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలో త్రిపురారం ప్రత్యేక అధికారి హోదాలో సిబ్బందితో కలసి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల వెంట చెత్త, మురుగు కాలువలో మట్టిని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదిర్శి కొడిరెక్క రాజేందర్, పంచాయతీ సిబ్బంది తధితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

మిర్యాలగూడ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. గురువారం పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి మండలంలోని యాద్గార్‌పల్లి, కాల్వపల్లి, కాల్వపల్లితండాలను పర్యటించి వీదులను, మురుగుకాల్వలను సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

మాడుగులపల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాములపాడు గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ ఏఈ నరేష్ అన్నారు. మండలంలోని పాములపాడు గ్రామంలో గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణను పంచాయతీ కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. గ్రామస్తులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

త్రిపురారం : ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగర్ రోడ్డు ప్రధాన సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మండల యువజన సంఘం అధ్యక్షుడు పీబీ రవి, కసిరెడ్డి నరేష్, త్రిపురారం పట్టణ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, బాలకృష్ణ, శ్రీను, సైదులు, లక్ష్మణ్, సతీష్, రవి, వెంకటేశ్వర్లు, జాంగీర్, శంకర్, రామలింగం, బాబు పాల్గొన్నారు.

28 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామం వద్ద హాలియా నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న వాహనాలను గురువారం రాత్రి రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అటుగా వస్తున్న వాహనంలో 120 బ్యాగులు(28 క్వింటాళ్ల) బియ్యం ఉన్నాయి. ఆ బియ్యానికి సంబంధించి ఎలాంటి వే బిల్లులు చూపించకపోవడంతో అనుమానంతో ఆ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ వాహనంలో ఉన్నది పీడీఎస్ బియ్యమా? నాన్ పీడీఎస్ బియ్యామా ? అనేది శుక్రవారం సివిల్ సప్లయ్ అధికారులు పరిశీలనలో తెలుస్తుందన్నారు. ఈ మేరకు అనుమానస్పదంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.